నూరేళ్ళ తెలుగు కథకు

నవ్య నీరాజనం - 19



# కారా మాస్టారి పరిచయంతో కథ తెలిసింది


**- విహారి విఠలమూర్తి**

వోలేటి వేంకట నరసింహమూర్తి అంటే బహుశా తెలియకపోవచ్చు, కానీ వివిన మూర్తి అంటే మాత్రం అంతా ఇట్టే గుర్తుపడతారు. కథాసాహిత్యంలో వివినమూర్తిదో ప్రత్యేకస్థానం. కథావస్తువును ఎన్నుకోవడంలో రాజీ లేని వ్యక్తిత్వమే కథానిలయం బాధ్యతలను నిర్వర్తించడంలో కూడా ఆయన అనుసరిస్తున్నారు. తెలుగు కథలన్నా కథకులన్నా ఆయనకు ప్రాణం. వారితో ఇంటర్వ్యూ ఈవారం మీకోసం...

మాది తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటకు దగ్గరలోని సకుమల్లతిమ్మాపురం అనే చాలా చిన్న పల్లెటూరు. చాలా పెద్దకుటుంబం. అతిపేదజీవితం. అమ్మ రాజేశ్వరమ్మ, నాన్న సూర్యనారాయణమూర్తి. వారికి నేను నాలుగోసంతానం. నా చదువు కాకినాడ, రాజమండ్రిల్లోనే కొనసాగింది. ముఖ్యంగా ఎక్కడ సత్రం వుందంటే అక్కడే నా చదువు. కాకినాడ రక్షణోదయ ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్‌లో చదివాక పియుసి రాజమండ్రిలో పూర్తిచేశాను. విశాఖపట్నంలో ఇంజనీరింగ్ సీటు వచ్చినా సత్రం ఎక్కడ వుందో తెలియక కాకినాడ ఆంధ్ర పాలిటెక్నిక్‌లో రెండేళ్ళ ఇంజనీరింగ్ పూర్తిచేశాను.1966లో చదువు పూర్తయినా నాకు వచ్చిన తొలి ఉద్యోగాన్ని తిరస్కరించడంతో 1971వరకు నన్ను నిరుద్యోగం వెంటాడింది. బతుకు భయాన్ని పరిచయం చేసింది.

### ఆత్మహత్యా ప్రయత్నం...

ఇంజనీరింగ్ పూర్తికాగానే ఎలక్ట్రికల్ సబ్ ఓవర్సీస్‌లో ఉద్యోగం వచ్చింది. ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ అంటేనే అవినీతిమయం. అందుచేత ఆ డిపార్ట్‌మెంట్‌లో చేరనని వాళ్లకి ఉత్తరం రాసి ఉద్యోగాన్ని తిరస్కరించాను. అప్పట్నుంచి మళ్ళీ ఏ ఉద్యోగమూ రాలేదు. నిరుద్యోగాన్ని భరించలేక ఇంటినుంచి పారిపోయి ఖరగ్‌పూర్, కలకత్తా, చక్రధర్‌పూర్‌లలో చిన్న చిన్న ఉద్యోగాలు చేశాను. రాజగంగ్‌పూర్‌లో రైల్వే ఎలక్ట్రిఫికేషన్‌లో సూపర్‌వైజర్ ఉద్యోగం వచ్చింది. ఆరునెలలు చేశాక అందులో లంచాలు తీసుకునే ఒకాయనతో తీవ్రంగా గొడవపడి ఉద్యోగం వదిలేశాను. ఇలా ఒకటీ అరా చేస్తున్న సమయంలోనే 1971లో నావల్ డాక్‌యార్డ్...అప్పట్లో దానిపేరు బేస్‌రిపేర్ ఆర్గనైజేషన్ (బిఆర్ఒ), దాంట్లో రాత పరీక్ష పాసై ఇంటర్వ్యూలో తప్పాను. దాంతో జీవితంపై విరక్తి కలిగి ఆత్మహత్య చేసుకోవాలని విశాఖ సముద్రం దగ్గరికి వెళ్లాను. సరిగ్గా ఆ సమయానికి అక్కడే వున్న ద్రోణంరాజు చలపతిరావు నన్ను కాపాడి వాళ్ల ఇంటికి తీసుకుపోయి భోజనం పెట్టారు. తరువాత ఆయన జలగం వెంగళరావు తమ్ముడు జలగం రామారావుతో నాగురించి చెప్పారు. రామారావు నేవీలో కెప్టెన్‌గా పనిచేస్తున్నారు. జలగం రామారావు రికమండేషన్‌తో బిఆర్ఒలో ఉద్యోగం వచ్చింది. ఆ తరువాత సంవత్సరమే 1972లో రామలక్ష్మితో వివాహం జరిగింది.


కాళీపట్నం రామారావు తదితరులతో....

### డిటెక్టివ్ కథతో మొదలు...

మా ఇంటి పక్కనే శ్రీమూర్తి అనే స్నేహితుడుండేవాడు. ఆయనకు దేవులపల్లి కృష్ణశాస్త్రి అంటే ఇష్టం. నాకు వేదుల సత్యనారాయణ శాస్త్రి అంటే అభిమానం. శ్రీమూర్తి వలననుకుంటాను ఐదోతరగతి, ఆరోతరగతి నుంచే చదవడం అలవాటయ్యింది. కాకినాడలో వుండగా టౌన్‌హాల్ గ్రంథాలయంలో ప్రభాకరన్ అనే లైబ్రేరియన్ పుస్తకాలను ఎంపికచేసి చదివించారు. నేను తొలిసారి ఏడోతరగతిలో వుండగా లెక్కలు గ్రాఫ్‌పుస్తకంలో పేజీలు ఖాళీగా వుండటం గమనించి అవి పూర్తి చేయడానికి కథరాసి పారేశాను. నరంతకులు వంటి డిటెక్టివ్ కథన్నమాట. రాయడం విషయంలో శ్రీమూర్తితో స్పర్ధ వుండేది. ఆయన ఒసారి 'ఏమిటీ కన్నీళ్లు' అని కథరాస్తే, నేను 'ఎందుకీ కన్నీళ్లు' అని రాశాను. ఆ దశలోనే పద్యాలు కూడా రాశాను.

### కొన్ని పరిచయాలు...కొన్ని మలుపులు

నా జీవితంలో చాలా మలుపులు ఉన్నాయి. నేను నిరుద్యోగాన్ని ఎదుర్కొంటున్న రోజుల్లోనే ఎమ్‌జిరావుగారితో నాకు పరిచయ భాగ్యం కలిగింది. రావుగారు, పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు మంచి స్నేహితులు. ఎమ్‌జిరావు 1966లో జరిగిన రైల్వే జనరల్ స్ట్రైక్‌లో పాల్గొనడంతో డిప్రమోట్ అయ్యారు. ఫలితంగా ఆయన హైదరాబాద్ రావడంతో ఉద్యోగాల వేటలో ఉన్న నేను ఆయన ఇంట్లో చేరాను. మినిస్టర్‌గా పనిచేసిన తోట రామస్వామిగారి ఇంట్లో కూడా నేను కొన్నాళ్ళు వున్నాను. వీరందరి సాంగత్యంతో నాకు కమ్యూనిజం పరిచయం అయ్యింది. ఆ భావజాలం నా ఆలోచలను బాగా ప్రభావితం చేసింది. 1976 ఉగాది కథలపోటీలో నా కథకి మూడోబహుమతి వచ్చింది. ఆ సందర్భంగా నా గురించిన పరిచయం రాస్తూ నాకు నచ్చిన ఒకే ఒక కథారచయిత కాళీపట్నం రామారావుగారని చెప్పాను. అలా కారామాస్టారితో నాకు పరిచయం ఏర్పడింది.

### సాహిత్యంపై గౌరవం పెరిగింది...

కథలు రాస్తున్నా సాహిత్యమంటే పెద్దగా గౌరవం వుండేది కాదు. కారామాస్టారి పరిచయంతో సాహిత్యం అంటే గౌరవం ఏర్పడింది. విప్లవం వచ్చేందుకు నిజమైన పరిస్థితులు దేశంలో వున్నాయన్నది నాకు కారామాస్టారు కథల్లో మాత్రమే కనిపించింది. ఆయన ఆర్తి, చావు కథలు నన్ను అంతగా కదిలించాయి. అప్పటివరకు ఏవో కథలు రాస్తున్నా ఎన్నడూ నేనూ రచయితనని అనుకోలేదు. మనం రచయిత అవునో, కాదో మనకే తెలుస్తుంది. ఈ విషయాన్ని 'సంధి' కథతో నేను తెలుసుకున్నాను. ఈ కథ 1985లో జ్యోతిలో వచ్చింది. సోమర్‌సెట్ మామ్ రాసిన 'ఫోర్స్ ఆఫ్ సర్కమస్టన్సెస్' కథాంశాన్ని అంగీకరించలేక దానికి జవాబుగా ఈ కథను రాశాను. పురుషుడి దృష్టికోణం నుంచి సోమర్‌సెట్ మామ్ రాస్తే నేను స్త్రీ కోణం నుంచి రాశాను. ఈ కథలో చాలా చోట్ల మానసిక స్థితి, పరిస్థితుల ప్రభావం, పరిసరాలు, వాతావరణం వంటివి బాగా నిర్వచించానని అనిపించింది. అందుకే కాబోలు 'సంధి' కథతో నేను కూడా రచయితనేమో అనిపించింది.

### అసంతృప్తి నుంచి ఆలోచనల దిశగా...

1986-87లో తొలిసారి పోలెండ్‌లో కమ్యూనిష్టులు ఏర్పరచిన ప్రభుత్వం కూలిపోయింది. 1989 నాటికి రష్యా కుప్పకూలిపోయింది. ఈ నాలుగేళ్లలో కమ్యూనిస్టులు కూలిపోవడంతో డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాను. రాసి ఉపయోగం ఏమిటి? ఎందుకు రాయాలి?అనే పరిస్థితి. ఆ స్థితిలో బెంగుళూరులో పరిచయం అయిన వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారు 'ఇలాంటి పరిస్థితుల్లోనే రచయితలు నిలబడాలి. సాహిత్యంతో వారు ఏమైనా చేస్తే ఇప్పుడే చేయాలి' అన్నారు. 'రాజకీయ నాయకులే కాదు రచయితలూ మాట్లాడాలి' అన్నారు. అప్పుడే మాయ-మహామాయ, పయనం,పలాయనం వంటి కథలు రాశాను.

### పుస్తకాలు పంచిన జ్ఞానంతో ...

మన పరిశీలనకు వచ్చిన విషయం ఎదుటి వ్యక్తిని ఆలోచింపజేసేదిగా ఉండాలంటే దానికి

## నచ్చినవి

| | |
|---|---|
| కథ | : వెన్నెల (రావిశాస్త్రి) |
| నవల | : అనుక్షణికం (వడ్డెర చండీదాస్) |
| రచయిత | : కాళీపట్నం రామారావు |
| కవి | : శ్రీశ్రీ |
| సినిమా | : మాయాబజార్ |
| పాట | : పాడవోయి భారతీయుడా.. |
| గాయని | : పి.సుశీల |
| గాయకుడు | : ఘంటసాల |
| నటి | : సావిత్రి |
| నటుడు | : ఎస్.వి.రంగారావు |
| మిత్రుడు | : శ్రీమూర్తి |
| వంట | : బొబ్బట్టు |


భార్య, కూతుళ్ళతో....

చాలా అవగాహన, అధ్యయనం అవసరం. ఈ అవసరాన్ని గుర్తెరిగే కాబోలు బెంగుళూరులో పరిచయం అయిన రాయుడుగారు నాచేత చాలా పుస్తకాలు చదివించారు. చైనా, ఇండియా, కొరియా వంటి దేశాల్లో వరల్డ్‌బ్యాంక్ ప్రతినిధిగా పనిచేసిన లెడ్‌లాన్‌స్కీ రాసిన అగ్రికల్చర్ యాన్ అన్‌ఫినిష్డ్ బిజినెస్‌లో లభ్యమైన ప్రపంచబ్యాంక్ రిపోర్టులు చదివే అవకాశం అప్పుడే దొరికింది. ఇక ప్రపంచ బ్యాంక్ ప్రచురణలో శామ్యుల్‌పి హంటింగ్ రాసిన పొలిటికల్ ఇన్‌స్టిట్యూషన్స్ పుస్తకంలో అవినీతి కూడా ఒక సామాజిక చలనశక్తి అని వివరించడం చదివి ఆశ్చర్యపోయాను. ఇటువంటి పుస్తకాల పరిచయంతో ఐఎమ్ఎఫ్, అమెరికా అప్పులపద్ధతి, గ్లోబలైజేషన్ వంటివాటితోపాటు టాటా బిర్లాల పెట్టుబడి విధానం, సమాజ జీవనంపై ప్రపంచ ఆర్థికశక్తులు ఏవిధంగా పనిచేసేదీ...అంతా మెల్లమెల్లగా అర్థంకాసాగింది. దాన్నే 'జగన్నాటకం' వంటి కథల ద్వారా నాకు తెలిసింది పాఠకులకు తెలియజేసేందుకు ప్రయత్నించాను. సాహిత్యం సమాజం గురించి ఆలోచించాలి. సాహిత్యానికి సామాజిక కర్తవ్యం, బాధ్యతని మార్క్సిస్ట్ భావజాలంలో వుంది. దీంతోనే నేను ఎదిగాను. ఫలితంగా దేన్నైనా స్వీకరించి, పరిశీలించడంలో నా అవగాహన స్థాయి పెరిగిందనుకుంటున్నాను.


కథానిలయంలో....

### ఇప్పుడంతా వ్యక్తివివేచన తగ్గించే సాహిత్యమే...

సాహిత్య ప్రయాణం ఒక దశనుంచి మరో దశకు చేరుకునే క్రమంలో కొన్ని అవసరం మేరకు పరిచయం కాగా మరి కొన్ని మధ్యలో వచ్చి తిష్టవేస్తాయి. 1995లో స్త్రీవాదం, దళిత వాదం సాహిత్యంలోకి వాటంతటవి ఒక అవసరంతో వస్తే మిగిలిన వాదాలు అనవసరంగా చొరబడ్డాయి. చివరకు ప్రభుత్వం ఉపయోగించే మైనారిటీ వాదం, బీసీవాదం లాంటి చాలా వాదాలు కథాసాహిత్యమ్మై కూర్చున్నాయి. వ్యక్తి నిర్ణాయక పాత్రను ఒకప్పుడు మార్క్సిస్ట్ సాహిత్యం ఎలా తక్కువ చేసిందో ఇప్పుడు అస్థిత్వవాదం పేరిట వస్తున్న సాహిత్యం కూడా అదే చేస్తోంది. వ్యక్తి తన ఆలోచనలతో, వివేచనతో చుట్టూ వున్న ప్రాంతాన్ని, పరిస్థితుల్నీ ప్రభావితం చేస్తాడు. దాన్ని కావాలనే కాదనుకుంటున్నాం. అలాగే ఆధునిక జీవితాల్లో నేడు గ్రామస్థాయిలో జరుగుతున్న మార్పులకు కారణమవుతున్న చోదకశక్తులు పట్టణాల్లో వున్నాయి. ఒకప్పుడు పల్లెల మీద పట్టణాలు బతికేవి. పల్లెల ఉత్పత్తి, శ్రమశక్తి మీద పట్టణాలు బతికితే ప్రస్తుతం పట్టణాల అవసరాల కోసం పల్లెలు ఊడిగం చేస్తున్నాయి. పల్లె, పట్టణానికి మధ్యపరస్పర సంబంధాలను, మార్పులను అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాను. ప్రస్తుతం వీటినే కథలుగా రాస్తున్నాను.

### కథానిలయంతో నా ప్రయాణం...


ఒకప్పుడు నేను బతుకుతెరువు కోసం ఉద్యోగం చేశాను. ఇప్పుడు మనస్సు తృప్తి కోసం కథానిలయం పనిని ఉద్యోగంగా భావించి చేస్తున్నాను. కథానిలయం విషయంలో కారామాష్టారిది ప్రొడక్షన్ అయితే నాది డిస్ట్రిబ్యూషన్. 1910 కథాసాహిత్యం కావాలన్నా, 2010సాహిత్యం కావాలన్నా ఎక్కువమందికి సాహిత్యాన్ని చేరవేసేందుకు ప్రయత్నిస్తున్నాను. మాష్టారిమీద గౌరవం, అభిమానంతో కథానిలయానికి వస్తే, ఇందులోకి వచ్చాక కథానిలయం విస్తృతి, లోతు, భవిష్యత్‌తరాలకు దీని అవసరం చూశాక పనిలో మరింత సంతృప్తిని పొందుతున్నాను. మా అమ్మాయిలు ముగ్గురూ స్థిరపడటంతో నా భార్యతోపాటు శ్రీకాకుళంలోవుంటూ కథానిలయం బాధ్యతలు చూస్తున్నాను. చాలా మంది ప్రస్తుతం కథ ఎలా వుందో, విమర్శ కూడా అలాగే వుంది అంటున్నారు. కథాసాహిత్యంలో పరిశోధన పెరిగితే క్వాలిటీపెరుగుతుంది. దీనికోసం కథానిలయాన్ని ఉపయోగించుకుంటే మరో ఐదేళ్లలో విమర్శలో గుణాత్మకమైన మార్పులు వస్తాయి. ఇక్కడ లభ్యమవుతున్న సాహిత్యాన్ని సంవత్సరాల వారీగా, రంగాల వారీగా అధ్యయనం చేయగలిగితే సాహితీవేత్తలు సమాజంలో ఏ రంగం పట్ల ఉత్సుకత చూపిస్తున్నారో తెలుస్తుంది.

**– బల్లెడ నారాయణమూర్తి**

## నాకు నచ్చిన నా కథ

- వివినమూర్తి

'తుమ్ బిన్ జావూం కహా?' అంటున్న కిషోర్ గొంతు నిద్రపోతున్న వసుధ దుప్పటిలోకి జొరబడింది. కదలబోయింది. చుట్టుకుని ఉన్న మోహనరావు నిద్దట్లోనే మరింత దగ్గరకు లాక్కుంటున్నాడు. మెల్లగా వదిలించుకుని లేచి కూర్చుంది. ఏభై ఆరేళ్ళ మోహన్రావు మొహం నిద్దట్లో ప్రశాంతంగా ఉంది. ఒకప్పుడు కిషోర్‌ని తనకి అంటించింది ఈ మోహన్రావే! నువ్వు వాడికోసమే పుట్టావే - అని చిన్నతనం నుంచి చిన్నాపెద్దా అంటుంటే, పెళ్ళాడి తీరాలనుకున్న పెద్దమేనత్త కొడుకు తల్లి అడిగిన కట్నం మేనమామ యివ్వలేనంటే, మొండిచెయ్యి చూపించి వెళ్ళిపోయాడు. అప్పుడు విషాదాన్ని ప్రేమగా భావించి, ముఖేష్‌లోకి ముడుచుకుపోయి మొహం వేలాడేసుకుని తిరిగే తనను వెంటాడి... నవ్వించి... కవ్వించి... కిషోర్‌ని తనకి అంటించి... తమ యిద్దరి బ్రతుకులనీ ఒకటిగా అతికించింది ఈ మోహనుడే!



నుదుటి మీద జుత్తును మెల్లగా స్పృశించి అతని వైపున ఉన్న పుస్తకాన్ని మూస్తూ పేరు చూసింది. మిళిందుడు మీద ఇంగ్లీషు పుస్తకం. పుస్తకాన్ని షెల్ఫ్‌లో ఉంచి టేబిల్‌మీద అతను రాస్తున్న కాగితాలను సర్ది బయటకు నడిచింది.

హాల్లో సుమన్ సోఫాలో పడుకుని టీవి చూస్తున్నాడు. రంగోలి-కార్యక్రమం. ఆదివారం అంత పొద్దుటే లేచి సుమన్ చూడడం వసుధకి కాస్తంత వింతగా అనిపించింది. సుమన్ తల్లిని చూడలేదు. అతను టీవీ కూడా చూడడం లేదు. చేతిలో అద్దం పెట్టుకుని తనని తనే చూసుకుంటున్నాడు. ఎంత చూసుకున్నా మధ్య మధ్యలో మొహం మాయమయిపోతోంది.

నున్నగా కాస్తంత సుకుమారంగా ఉన్న బుగ్గలు. వాటిమీద విశాలమైన కళ్ళు, తీర్చిదిద్దినట్టున్న మొహం. నీ కళ్ళు భలే మెరుస్తాయి సుమన్ - అంటోంది సౌమ్య. సౌమ్య బాబ్డ్ జుత్తును చూస్తూ చూస్తూ - కత్తిరించుకున్న జుత్తు వాళ్ళ మీద కంపరం పోగొట్టుకున్నాడు సుమన్.

"ఏంటి నాన్నా - ఆదివారం పొద్దుటే లేచి అద్దం పట్టుక్కూర్చున్నావూ?" అంటూ చూసి చూసి పలకరించింది సుధ.

"ప్రేమంటే ఏంటమ్మా?" అని అడిగాడు.

ఆరేళ్ళుగా సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తూ, అంతకు ముందు నాలుగు సంవత్సరాలు ఇంజనీరింగ్ డిగ్రీ చేసిన కొడుకు ప్రశ్న వసుధలో రకరకాల ఆలోచనలు కలిగించింది.

"సడన్‌గా ఏంట్రా ఈ అనుమానం?" అంది.

"బావోలేదు"

"ఏంటీ?"

"నా ప్రశ్నా - నీ జవాబూ" నవ్వాడు.

"ఎవర్రా ఆ అమ్మాయి?" వసుధ కూడా నవ్వి అడిగింది.

"సౌమ్య" అన్నాడు.

"ఊఁ!"

"నా కొలీగ్!"

"సీనియరా, జూనియరా?" అడిగింది.

అయోమయంగా చూసి, "సీనియర్ ఎలా అవుతుందమ్మా?" అన్నాడు.

"ఏం ఎందుకు కాకూడదూ," అన్నట్లు చూసి నవ్వింది.

"ఎప్పుడు పరిచయం చేస్తావు?" అంది.

"సౌమ్యతో మాట్లాడాలి".

"తొందరగా మాట్లాడు", అంటూ ఆగి, "నా సంగతి, డాడీ సంగతి తెలుసా?" మారిన గొంతుతో ప్రశ్నించింది.

"ఇంకా చెప్పలేదు.."

"కనీసం నువ్వు ప్రేమించాననయినా చెప్పావా?"

"తెలియదు," ఆలోచనగా అన్నాడు.

ఆ జవాబుకి నివ్వెరపోయింది వసుధ.

"పోనీ, ఆ అమ్మాయైనా చెప్పిందా?"

తల అటూ ఇటూ ఊపుతూ, "తెలీదమ్మా!" అన్నాడు.

"ఏడాదయింది తను చేరి", అంటూ మొదలెట్టాడు.

"రోజూ కలుస్తాం. గంటల తరబడి కబుర్లు. అదీ ఇదీ అని లేదు. రాజకీయాలు, సాహిత్యం, టెక్నాలజీ... హిస్టరీ... ప్రతిదాని మీదా తనకి ఓ అభిప్రాయం ఉంటుంది. అన్ని విషయాలు తెలుసుకోవటానికి టైమెక్కడి నుంచి వస్తుందో" సుమన్ చెపుతూనే ఉన్నాడు.



సౌమ్య మీద అతని అడ్మిరేషన్ తెలిసిపోతూనే ఉంది. నీ కళ్ళు చాలా అందంగా ఉంటాయి అం టుందిట. ఆమె అందానికి అతనూ కాంప్లిమెంట్స్ ఇస్తుంటాట్ట. అయితే కాంప్లిమెంట్స్‌ని సౌమ్య మరికొందరికి కూడా ఇచ్చిందట. ఎవరియినా ప్రశంసిస్తే, 'థాంక్స్' అని చెపుతుందిట.

"నువ్వు చెప్పు. నేను ప్రేమించానని చెప్పానా, లేదా?" వసుధ ఆలోచనలకి అడ్డు తగిలాడు సుమన్.

ఒకప్పటి రోజులలో అయితే అతను చెప్పినట్టే, ఆమె ఒప్పుకున్నట్టే, బహుశా ఇప్పుడు?! ఈ బెంగుళూరు నగర సంస్కృతిలో?!!

వసుధ ఓ నిశ్చయానికి వచ్చినట్టుగా అంది, "కన్నా! నువ్వు ముందో నిర్ణయం తీసుకో. నీకా అమ్మాయితో జీవితం బాగుంటుందనిపిస్తే ఆ అమ్మాయితో చెప్పు. ఆ పిల్ల ఒకవేళ తిరస్కరించినా, నువ్వు ఆ అభిప్రాయాన్ని గౌరవించాలి".

"ఛఛ! నాకు ఎగో లేదమ్మా! కానీ... ఆ అమ్మాయి కాదనేస్తే... నేను హర్టవనుగానీ.. ఎలా చెప్పాలో తెలీటం లేదు. అసలు... అసలు ఆ అమ్మాయి నన్ను ఒప్పుకుంటుందంటావా?... ఆఫ్ కోర్స్! కొన్నాళ్ళు బాధగా ఉంటుంది... ఏమో! నాకు చెప్పాలో లేదో తెలీటం లేదు..."

కొడుకు మాట్లాడుతున్న దానికీ, మనసులో జరుగుతున్నదానికీ మధ్య అంతరం వసుధకి తెలుస్తూనే ఉంది.

"నీకేం తక్కువనిరా, అలా అనుకుంటున్నావు. ఓ పని చెయ్యి. సౌమ్యని తీసుకురా! నేను మాట్లాడతాను" అంది వసుధ.

***

అంతా విని, "నువ్వు పొరపాటు చేశావు వసూ!" అన్నాడు మోహనరావు.

"ఏంటదీ?"

"ఎవరికి వారు తెల్సుకోవలసిన విషయాలుంటాయి. వాటిలో తల్లిదండ్రులైనా తల దూర్చ కూడదు, బహుశా..." అంటూ ఆగాడు.

అతను మాట ముగించడని అర్థమయ్యాక, "చెప్పు మోహన్!" అంది.

"ఫీలవుతావేమోనని.."

"నిన్నాదిలేసి వెళ్ళే వయసు కాదులే గురువా!"

"కొడుక్కి నచ్చిన బొమ్మను కొనిపెట్టే తల్లిలా కనిపిస్తున్నావు".

"తప్పా?"

"తప్పే!"

వసుధ ఆలోచనలో పడింది.

అతను నడుపుతున్న 'దళితధ్వని', 'కొత్త సంచిక కోసం రాస్తున్న సంపాదకీయానికి, 'దళిత కవిత్వ మంటే ఏమిటి?' అన్న శీర్షిక పెడదాం అన్న ఆలోచనలో పడ్డాడు.

## 2

"మీరు తెలుగువాళ్ళా?" అంది వసుధ. ఆమె గొంతులో ఆనందం, ఆశ్చర్యం కలగలిశాయి.

సౌమ్య అమ్మానాన్నలది కోలారు జిల్లా. ప్రస్తుతం తండ్రి బెల్‌లోనూ, తల్లి బ్యాంక్‌లోనూ పని చేస్తూ గిరినగరిలో ఇల్లు కట్టుకుని బెంగుళూరులో స్థిరపడ్డారు. ఇద్దరు ఆడపిల్లలు.


సౌమ్య చెల్లెలు ఆర్కిటెక్చర్‌లో చేరి రెండేళ్ళయిందిట.

వివరాలన్నీ తెలుసుకున్నాక, "మా వాడు చెప్పినదానికన్నా నువ్వు బాగున్నావు" అంది వసుధ నవ్వుతూ.

"నా అందాన్ని తక్కువ చేసి చెప్పటానికీ నీకెంత ధైర్యం!" అంది సౌమ్య విశాల నయనాలలోకి కినుకను ఆహ్వానిస్తూ.

సుమన్ నవ్వాడు.

మరికొన్ని నవ్వులు పువ్వులయ్యాక, వసుధ అడిగింది.



''ఇంక లేటెందుకమ్మా? మీ ఇంటికి ఎప్పుడు రమ్మంటావ్!''

''మీ ఇష్టం. ఇప్పుడే రండి. తీసుకెళ్తాను'' అంది.

తనన్న మాటలలో అర్థాన్ని ఆ అమ్మాయి గ్రహించలేదని వసుధకి అర్థమయింది.

''సరే! నేనే ఐస్ బ్రేక్ చేస్తాను'' అంది వసుధ.

సౌమ్య అయోమయంగా చూసింది.

సుమన్‌కి నువ్వంటే ఇష్టం. నీకూ ఇష్టమైతే పెళ్ళాడతాడు. నీ అభిప్రాయం చెప్పు – వసుధ పది మాటల సారాంశం.

సౌమ్య మొహాన్ని పరిశీలిద్దామన్న వసుధ ప్రయత్నం ఫలించలేదు. ఆమె అక్కడున్న పేపర్‌ని చదువుతున్నట్లు కూర్చుని వసుధ మాటలు పూర్తయేవరకు తలఎత్తలేదు. ఆ తరువాత కొంత నిశ్శబ్దం చోటు చేసుకున్నాక, సౌమ్య లేచింది.

''సుమన్! నువ్వు ముందుగా నాతో మాట్లాడితే బాగుండేది. వస్తాను ఆంటీ!'' అంటూ లేచి బయ టికి వెళ్ళిపోయింది. ఆమె వెనుకే సుమన్, వాళ్ళ వెనుక వసుధ బైటికి నడిచారు. సౌమ్య తన కారులో కూర్చుని ఎవరికీ బై కూడా చెప్పకుండా స్టార్ట్ చేసింది.

***

''నువ్వింత అప్‌సెట్ అవటం... చిత్రంగా ఉంది'' అన్నాడు మోహన్రావు.

''అవుననో, కాదనో చెప్పాలి గదా,'' అంది వసుధ.

''అవుననే చెప్పాలి నీకు!'' అన్నాడు.

''ఇంతకన్నా చక్కని కోడలు దొరుకుతుంది'' అంది.

''అయినా సరే! అవునంటేనే నీకు తృప్తి''.

''ఏంటీ నీ ఉద్దేశం?''

''మగపిల్లాడి తల్లివి కదా! అందులోనూ నెలకి డెబ్బై వేలు సంపాదిస్తున్న మగపిల్లాడి తల్లివి. నువ్వు ప్రపోజ్ చేస్తే ఆడపిల్ల జాక్‌పాట్ కొట్టినట్టు రియాక్టవాలి''

''నేనలాంటి దాన్ని కాను. ఆ విషయం నీకు తెలుసు మోహన్!''

''నీ గురించి నాకు తెలుసు. మన సమాజం గురించే నాకు భయం''

''నువ్వనేది...?''

''మనది సమాజమనాలో, సంస్కృతి అనాలో, దేశం అనాలో, మతం అనాలో నాకు తట్టడం లేదు. ఇక్కడ పుట్టిన కొత్త ఆలోచనలనే కాదు, ఎక్కడెక్కడి నుంచో వచ్చిన ఆలోచనలను కూడా మనం మన ఆలోచనల్లో కలిపేసుకుంటాం! దాన్ని పరమత సహనం అన్నా అనొచ్చు. దైనందిన జీవనంలో మాత్రం మన మౌలిక తత్వం మారదు''.

''నాకు అర్థం కావడం లేదు''

''నాకూ అర్థమవటం లేదు. నువ్వింతగా అప్‌సెట్ అవ్వడం''

''మోహన్!''

''మన ఆలోచనల చుట్టూ లక్షలాది ఉచ్చులుంటాయిరా. ఆలోచించు'' అన్నాడు వసుధని దగ్గరకి తీసుకుంటూ.

## 3

మూడు నెలల తర్వాత–

రాత్రి పన్నెండు గంటల వేళ పని నుంచి ఇంటికి వచ్చిన సుమన్ మామూలుగా గేటు దూకి లోపలికి వచ్చాడు. గేటు తాళం సంకేత స్థలం లోంచి తీసి గేటు తలుపు తీసి తన బైక్‌ని లోపలికి తెచ్చుకున్నాడు. యింటి తాళం తెరచుకుని డైనింగ్ టేబుల్ మీద అమ్మ పెట్టిన వంట పదార్థాలు చూస్తూ మధ్యలో ఓ వేలితో నాలిక్కి రాసుకుంటూ బట్టలు మార్చుకున్నాడు. బర్ముడా తగిలించు కుని బాత్రూంలోకి వెళ్ళి మొహం కడుక్కుని వచ్చి టేబుల్ ముందు కూర్చున్నాడు. ప్లేటు తీసుకుని అన్నం వడ్డించుకున్నాడు గాని తినకుండా కూర్చున్నాడు. రెండు మూడు సార్లు తల్లిదండ్రుల గది వైపు చూసి, నెమ్మదిగా లేచి వెళ్ళి, ''అమ్మా! అమ్మా!'' అని పిలిచాడు.

వసుధ లేచి వచ్చి తలుపు తీసింది.

సుమన్ మొహం వెలిగిపోతోంది. తలుపు వేసి వచ్చి, ''ఏంటి నాన్నా!'' అంది.

''నీ జీవితంలో గొప్ప సంతోషం ఎప్పుడు కలిగిందో చెప్పు!'' అన్నాడు.

కొడుకు వేపు విచిత్రంగా చూసి, ''నాకు యస్సెస్సెల్సీలో స్టేట్ థర్డ్ ర్యాంక్ వచ్చినప్పుడు'' అంది.

సుమన్ హతాశుడైనట్లు చూసి, ''నాన్నగారు నిన్ను ఓకే చేసినప్పుడు కాదా?'' అన్నాడు.

కొడుకు సంతోషమూ, డిజప్పాయింట్‌మెంటూ, హడావుడీ చూస్తున్న వసుధ నవ్వి, ''కొంపదీసి సౌమ్య...?'' అంది.

''అవునమ్మా. పెళ్ళికి ఒప్పుకుంది'' అన్నాడు.

అప్పుడెందుకు కాదంది, అని అడుగుదామని తమాయించుకుని, ''అలాగా'' అంది.

అమ్మదనం తల్లి గొంతులో వెదుక్కుంటున్న సుమన్ మొహం చిన్నబోతుంటే, వసుధ అతన్ని భుజం మీద మృదువుగా తట్టి, ''చెప్పరా!'' అంది.

కట్టలు తెగాయి. కబుర్లు పొంగాయి.

ఆ రోజు యింటికి వచ్చే వరకూ సౌమ్య సుమన్ని కొలీగ్ లాగే చూసిందట. ప్రేమా... పెళ్ళి... లాంటి ఆలోచన రాలేదట. జరిగిందానికి సుమన్, 'సారీ' చెప్పాడుట. క్రమంగా వాళ్ళిద్దరూ ఒకరి విషయాలు ఒకరు తెలుసుకున్నారట. వసుధ బ్రాహ్మిన్ అనీ, మోహన్రావు మాల అనీ చెప్పగానే సౌమ్య కొన్నాళ్ళు మాటలు తగ్గించిందిట.

''ఆ విషయం ఎందుకు చెప్పావూ?''అంది వసుధ.

''అందులో దాచటానికి ఏముందమ్మా?'' అన్నాడు.

''దాచమని కాదు. ఇంకా ఈ రోజుల్లో... ఇలాంటి సిటీల్లో... అవన్నీ ఎవరు పట్టించుకుంటారని...''

సుమన్‌కి తల్లి అర్థం కాలేదు.

తమ విషయం కొడుకు ఆశలకి అడ్డం వస్తుందని భయం. దాన్ని వ్యక్తం చేయలేదు.

''సరే! చెప్పు...'' అంది.

సౌమ్య స్వయంగా ప్రపోజ్ చేసిందట. తను ఒప్పేసుకున్నాట్ట. సుమన్ అన్నం తింటూ చెప్పుకు పోతున్నాడు.

***

''ఆ అమ్మాయి మంచి ఆలోచనాపరురాలు. ఆదర్శాలు కూడా ఉన్నాయి. మన సుమన్ జీవితం పూలబాటే'' అంది వసుధ.

''అలాగే ఆశిద్దాం'' అన్నాడు మోహన్రావు ఆలోచనగా.

''ఏదో ఆలోచిస్తున్నావు!?'' అంది.

''నువ్వు ఉత్సాహంగా ఉన్నావు. నా భయాలకి పునాది లేదు''

''చెప్పు మోహన్! ఇది మన బిడ్డ జీవితం''


''.........''

''నిరుత్సాహపడొచ్చు. కాని... ఆలోచిస్తాను కూడా! సౌమ్య మనకి తగదంటావా?''

''లేదు... లేదు.. ఏ నిర్ణయం వెనక ఏ ప్రేరణలున్నాయోనని భయం. ప్రతి ప్రేరణా హృదయం నుంచి రావలన్నాది పేరాశ కదా!''

''సౌమ్యకి మనవాడి కొచ్చినంత జీతమూ వస్తుంది''

''ఛ ఛ! ధనం ప్రేరణ అయ్యే అవకాశం లేదు. కనీసం యీ మనీ ఇండియా – అంటే సాఫ్ట్‌వేర్ ఇండియాలో, అందులోనూ వివాహ విషయంలో ధనం వీళ్ళకి ప్రాధాన్యం కాదు''.



''అయితే...''


''థ్రిల్!''

''......''

''అవును వసుధా! ఈ కాలం యువతని నడిపిస్తున్నది థ్రిల్! దీన్ని సృష్టించటంలోనూ, కొనసాగించటంలోనూ..... ప్రస్తుత ప్రపంచ వ్యవస్థ విజయవంతమయింది. అభివృద్ధికి ఎంటర్ ప్రైనర్‌షిప్ ప్రధానమనే సిద్ధాంతాలూ, వెంచర్ పెట్టుబడులూ.... ఎన్నెన్నో తగులుతాయి, ఆలోచిస్తుంటే''

''నువ్వనే దానికీ, ఈ పెళ్ళికి నాకు లింకు దొరకటం

## నాకు నచ్చిన నా కథ



'**జ**గన్నాటకం' కథ రాయటానికి చాలా కష్టపడ్డాను. కానీ అది రాణించలేదు. కథగా ఎక్కువమందిని అది ఆకర్షించలేదు. 'జ్ఞాతం' కథ మిగతా వాళ్లని ఎందుకు ఆకర్షించిందో చెప్పలేను గానీ, కులవ్యవస్థ నిర్మూలనకు వెయ్యిసంవత్సరాల చరిత్ర వుంది. కుల వ్యవస్థను రూపుమాపేందుకు అనేక రకాల ప్రయత్నాలు జరిగాయి. ముఖ్యంగా ఆధ్యాత్మిక రంగంలో ఏలికల సహాయంతో మార్పులు తేవడానికి చాలా ప్రయత్నాలు జరిగాయి. అయినా కులవ్యవస్థ రకరకాల సామాజిక అవసరాలకోసం బతికేవుంది. దానిని పార్రదోలడానికి మార్క్సిజం కృషి చేసింది. అయినా ఫలితం పెద్దగా లేకపోయింది. కుల వ్యవస్థ ఈనాడు ధరించిన మరొక రూపం చూశాక ఈ కథ రాయకుండా వుండలేకపోయాను. ఇటువంటి ఆత్మవిమర్శాధోరణి ఆధునిక సాహిత్యం ఆరంభం నుంచీ మొన్నటి డెబ్బై దశకం వరకు ప్రధాన స్రవంతిలో వుండేవి. ఇప్పుడు అది లేదు. ఇపుడు ఆత్మసమర్థనా కథలు ప్రధాన స్రవంతి అయ్యాయి. ఈస్థితిలో ఈ కథ నేను అనుకున్న మేర రాయడంతో 'జ్ఞాతం'పై గౌరవం పెరిగింది.

**-విహినమూర్తి**

సెల్: 9705471377

---

లేదు.''

''ప్రత్యక్షంగా ఏమీ లేదురా! ఇదొక మానసిక వ్యవహారం. దీనికి బయటనడుస్తున్న దానికీ సంబంధం ఉందనేది వాస్తవం. ఆ సంబంధం విశ్లేషించటం అంత సులువు కాదు. థ్రిల్! ప్రేమిస్తున్నామన్న థ్రిల్! ఉద్ధరిస్తున్నామన్న థ్రిల్! ఎదిరించటలో థ్రిల్! ఎదిరిస్తున్నామనుకోటం థ్రిల్!''

''నువ్వు విపరీతంగా ఆలోచిస్తున్నావురా!''

''కావచ్చు''

''నీడలని చూసి బెదురుతున్నావు''

''నీడలయినా వాటంతట అవి ఏర్పడవు కదా!''

''...... ........''

''ఎంత బెదిరినా జీవించకుండా పోంగదా! అసలు వివాహమే ఓ శాశ్వత విషయంగా భావించటం మాత్రం సమంజసమా?!''

**4**

''మీరు మా యింటికి రండి ఆంటీ! మా అప్పా, అమ్మలతో చెప్పాను'' అంది ఫోనులో సౌమ్య.

అడ్రస్సు, ఫోను నంబరు వగైరాలు చెప్పాక, ''ఫోను పెట్టనా'' అడిగింది వసుధ.

అవతలి నుంచి సౌమ్య గొంతు వినిపించలేదు. కొంతసేపు చూసి, ''ఏదో చెప్పాలనుకుంటున్నావు... చెప్పు తల్లీ!'' అంది వసుధ.

''అంకుల్ విషయం మా ఇంట్లో చెప్పకండీ ఆంటీ!''

''అంటే?''

''అందరూ మనంత ఎడ్వాంచరస్‌గా ఉండరు గదా ఆంటీ...''

''సౌమ్యా..!!''

''అయ్ మీన్... అనవసరంగా ట్రబుల్ చెయ్యటమెందుకు ఆంటీ''

''అవుననుకో, కానీ....''

''మా వాళ్ళు బాగా ఆర్తోడాక్స్ బ్రాహ్మిన్స్''

''........''

''ప్లీజ్! ఆంటీ!''

***

పుస్తకం మూసి, పక్కన బెట్టి, ''ఏదో చెప్పాలనుకుంటున్నావు, చెప్పు'' అన్నాడు మోహన్రావు.

''లేదు... లేదు. ఏదో ఆలోచన!''

''పోనీ, అదేంటో చెప్పు''

''అదా, అదీ... ఏం అన్నీ నీకు చెప్పాలా. అలా అని ఒప్పందం చేసుకున్నామా?'' ముక్కు పట్టుకుని ఊపింది.

మోహన్రావు నవ్వేసి పుస్తకం తీస్కున్నాడు.

టాయ్‌లెట్‌లోకి వెళ్ళి వచ్చింది.

''వంట్లో బాగోలేదా?''

''ఏం? అలా కనిపిస్తున్నానా?''

''రెండోసారి వెళితేనూ''

''బానే వుందిరా'' అంది దుప్పటి కప్పుకుంటూ.

కొంతసేపు అయ్యాక, దుప్పటి తీసి, ''అన్నట్టు...'' అని ఆగింది.

''చెప్పు వసూ!''

''వాళ్ళు బ్రాహ్మిన్స్‌ట'' అంది.

''అయితే?''

''ఏం లేదు. చెప్పానంతే''

అతను మాట్లాడలేదు. పుస్తకంలోని మిళిందుడి వాక్యాలు గుర్తు వస్తున్నాయి.

'వాదించేది రాజుతోనా, పండితునితోనా అన్నది గుర్తు పెట్టుకోవాలి'

''వసుధా!'' అని పిలిచాడు.

దుప్పటి కప్పుకున్న వసుధ నుంచి జవాబు లేదు.

'ఎందుకంత తడబాటు? ఆనందమా, పోయింది పొందుతున్నాననా! ఛ! నీ గురించి అలా ఆలోచించడం పొరపాటు' అనుకుని లైటు ఆర్పేసి ఆమెని దగ్గరకు తీసుకున్నాడు.

***

అనుకున్న రోజున అనుకున్న సమయానికి వసుధ, మోహన్రావు, సుమన్ గిరినగరలో వాళ్ళింటికి చేరుకున్నారు.

సౌమ్య తల్లి శాంత, పచ్చటి పసిమిఛాయ. ప్రకాశరావు కాస్తంత పీలగా చామనఛాయగా ఉన్నాడు. గేటు దాకా వచ్చి ఆహ్వానించారు. ఇంట్లోకి అడుగు పెడుతూనే హాల్లో గోడ మీద రాఘవేంద్రస్వామి ఫోటో ఒకటి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

నాలుగు పడక గదులూ, విశాలమైన హాలూ.... డైనింగ్ హాలూ... ఇటాలియన్ మాడ్యులర్ కిచెనూ....

అన్నీ చూశాక, అందరూ హాల్లో కూర్చున్నారు. వసుధ కలుపుగోలు తనంతో వాతావరణం కాస్త తేలికపడింది.

సౌమ్య, కాఫీలు చిరుతిళ్ళు తెచ్చింది.

అవి అవుతుండగా, శాంత అడిగింది.

''మీ గోత్రం ఏంటండీ వసుధగారూ!''

వసుధ తుళ్ళిపడి, సర్దుకుంటూ, ''గోత్రమా, గోత్రం... నా గోత్రం... గౌతమస. మా యింటి పేరు మోలేటి. మావేపు ఆరువేల నియోగులంటారు. మీ కన్నడిగులలో అలాంటివి ఉండవు కదా!''

తృప్తిగా నవ్వింది. ''ఈ తట్టూ ఉంటాయి. బబ్బూరు కమ్మ అంటారు. మమ్మల్ని బ్రాహ్మిన్స్ అలాంటివి చూడటం లేదు. అయ్యంగార్లయినా, అయ్యర్లయినా చాలామంది చేసేసుకుంటున్నారు. ఒక్కోళ్ళు స్మార్త, మాధ్వమాత్రం చూస్తారు. గోత్రాలు కలవటం ఎవ్వరూ ఒప్పుకోరు. అదయినా తెలుసుకోవే అంటే సౌమ్య ఒప్పుకోలేదు. అయినా మన భయాలు వాళ్ళకి తెలియవు. మాది శ్రీవత్స గోత్రం'' అంటూ మాటలాడుతోంది శాంత.

ఆ ప్రశ్న వేసినప్పటి నుంచి శాంత మాటలయ్యే వరకూ మోహన్రావు కాఫీ తాగలేదు. కొడుకు మొహంలోకి చూశాడు. గాభరా, కించ.... తెలుస్తూనే ఉంది. భార్యను చూడబోయాడు. మొహం చాటేస్తున్నట్లు అర్థమయింది. సౌమ్య మొహం గంభీరంగా, ఆందోళనగా వుంది. ఆమె తల్లితో పోట్లాడబోతున్నట్టే వుంది.

కాఫీ తాగటం మొదలు పెట్టాడు.

పూర్తయ్యాక కప్పు కింద పెట్టాడు మోహన్రావు.

''నేనో విషయం చెప్పాలి, ప్రకాశరావు గారూ!''

''తప్పకుండా చెప్పండి సారూ! మన స్టేటస్‌కి తగ్గకుండా ఏర్పాట్లన్నీ చేస్తాను. కావాలంటే ఫైవ్ స్టార్ రిసెప్షన్‌కి కూడా అభ్యంతరం లేదు. అయితే మా వాళ్ళూ చాలామంది వున్నారు. తగినంత వ్యవధి ఉంటే మంచి ఛత్రం దొరుకుతుంది. బెంగుళూరులో ఛత్రాలు దొరికాక పెళ్ళికొడుకలని వెదుకుతారని జోకుంది,'' ప్రకాశరావు ఉత్సాహంగా అంటూ, మోహన్రావు మొహంలో సీరియస్‌నెస్ గమనించి ఆగిపోయాడు.

''మీ తెలుగాళ్ళలో కట్నాలుంటాయంటే సౌమ్య కాదంది. దానికి అభ్యంతరం లేకపోతే...''

మోహన్రావు ధృడంగా చేయి ఎత్తి ఆగమని, ఆగాక అన్నాడు ''నేను బౌద్ధుడిని''

కవిత



## చినుకు పొద్దు

మొగ్గకి
మెలకువ నిచ్చేది
అరికాళ్లకి
బురద బూట్లు తొడిగేది
చినుకు పొద్దు పొడిచి నప్పుడే..
ఏ చినుకు చుబుకం తాకినా
"నాహి సింగిటి యాంగ్" జలపాతంలా
చిరపుంజీ ఆలోచనల ఆరబోతే..
గిడస బారిన వంగడం
ఎడ్డిరకం నడ్డి విరిచే
ప్రతి మబ్బు తునకా మట్టే అవుతుంది
దిమ్మర పోతలో కళ్లు తెరిచే వర్షం
పూచిక పుల్లలతో
కాలువలు తీసిన బాల్య జ్ఞాపకాల దొంతరే..
చలి చితుకులతో
నులి వెచ్చని ఆలోచనల పరంపరే..
తడవడమూ.. వణకడమూ.. జలుబు
పడటమూ
పులకించే ప్రకృతి ముందు దిగదుడుపే..
బతుకు వాసనలోంచి
ఆర్కెడ్ పుష్పంగానో.. సీతాకోక రెక్కగానో
చిరపుంజీ చినుకుతో ముచ్చట్లాడడం
అదో థ్రిల్..
కురిసీ కురిసీ కుమ్మరింతలో
కనురెప్పలు నొప్పెట్టేంత సేపూ వర్షాన్ని
చూడటమూ
చెవి పొరలు కంపించి పోయేదాకా
చినుకులు చిలకరించిన కూనిరాగం
వినడమూ
చిన్నప్పణ్నించీ చెప్పలేని యిష్టం

-ఎస్.ఆర్.భల్లం

"అంటే... బౌద్ధం కూడా... హిందూ మతమే గదా" అని.. ఆగి, "అంటే... మీరు... రావు... మోహ న్రావు... బ్రాహ్మిన్స్".

"కాదు. తెలుగువాళ్ళలో రావు అన్ని కులాల వాళ్ళకీ ఉంటుంది. నేను మాల..." అన్నాడు.

శాంత పిచ్చిపట్టినట్టుగా లేచి, "నేను చచ్చయినా పోతాను గాని, ఈ పెళ్ళికి ఒప్పుకొనేది లేదు" అనేసి లోపలికి వేగంగా వెళ్ళిపోయింది.

వెళ్తున్న తల్లివేపే చూస్తూ, మొహం కందగడ్డలా చేసుకుని, కత్తిరించుకున్న జుత్తు కదులుతుండగా, "నన్ను చంపినా సరే, నేను సుమన్‌నే పెళ్ళాడతా" అంటూ తన గదిలోకి పరుగెత్తింది.

మోహన్రావు లేచి, 'నే వెళ్తున్నాను.' అనేసి బయ టకు వెళ్ళిపోయాడు.

ప్రకాశరావు కుర్చీకి అతుక్కుపోయినట్టు కూర్చుం డిపోయాడు.

వసుధ, సుమన్ లేచి మౌనంగా నమస్కరించి బయటికి నడిచారు.

***

దోవలో స్నేహితుల దగ్గరికి వెళ్ళొస్తానని దిగిపో యాడు సుమన్. ఇంటికి వచ్చిందాకా వసుధ, మోహ న్రావు ఒక్క ముక్క మాట్లాడుకోలేదు.

ఇంటికి చేరాక వసుధ ఆరంభించింది.

"కొడుకు కోరాడని, వాడి కోరిక తీరుతోందని ఆశ పడ్డాను" అంది.

"దాచాలని నేనూ అనుకోలేదు. ఇవన్నీ నేనూ నమ్మను. నువ్వూ నమ్మవు. సౌమ్యా నమ్మదు. పెళ్ళయే వరకూ దాచితే మాత్రం తప్పేంటి?" అంది.

"అయినా సౌమ్య చెప్పొద్దన్నప్పుడు నేను చెబితే ఏం బాగుంటుంది?" అంది.

అలా ఏదో ఒకటి అంటూనే ఉంది వసుధ.

మోహన్రావు పెదవి విప్పలేదు. అతనేదో పుస్త కంలో తల దూర్చుకుని కూర్చున్నాడు. భోంచేద్దాం రమ్మంది కదలలేదు.

చెప్పి... చెప్పి... చెప్పి... మాట్లాడి... మాట్లాడి... రాత్రి తొమ్మిది గంటల వేళ... వసుధ బద్దలయింది.

"ఒకటా... రెండా... పాతికేళ్ళు. పాతిక సంవత్సరా లకు పైగా కలిసున్నాం. సుఖంగా ఉన్నాం. ఒకరినొ కరు తెలుసుకున్నాం. ఒకరికొకరం తెలియబరుచు కున్నాం. ఇదంతా...ఈ క్షణంవరకూ మన యిద్దరి అభి ప్రాయం. పోనీ...నా అభిప్రాయం. పాతికేళ్ళుగా బలప డుతూ వచ్చిన అభిప్రాయం. ఇదంతా ఒక పెద్ద అబద్ధ మని.... నేను ఏర్పర్చుకున్న భ్రమ... అనీ యిప్పుడూ నాకు అర్థమయింది".

"వసుధా.."

"నన్ను మాట్లాడనీ! కనీసం నా మీద జాలిపడు! నన్ను మాట్లాడనీ..."

"........"

"మనమిద్దరం వసుధ, మోహన్రావులు కాదు. అలా అయ్యే అవకాశం లేదు. మన పుట్టుకలు మనని వదలవు. నేను బ్రాహ్మణ కులం. నీవు మాల. నేను ఆడదాన్ని. నువ్వు మగాడివి. వీటిని మనం అధిగమించామనే నేను ఈ క్షణంవరకూ అనుకున్నాను. లేదు. అది సత్యం కాదు. మనమిద్దరం ఏనాడూ పోట్లాడుకోలేదు. ఒకరినొకరం అవమానించుకోలేదు. అలాగనే నేను అనుకున్నాను. కాని... యిప్పుడు నాకు అర్థమయిందేంటంటే".

తల అటూ ఇటూ ఊపుతూ, కొంతసేపు మౌనం వహించి, నెమ్మదిగా స్ఫుటంగా ఆరంభించింది.

"నీ ఉద్దేశ్యం ప్రకారం నువ్వు నాతో పోట్లాడలేదు. దానికి కారణం నీ సంస్కారం. నీ సహనం. నువ్వు నాలో ఎన్నో తప్పులుచూశావు. ఆడది. అజ్ఞాని. క్షమిం చాలి. సహించాలి, అని అనుకుంటావు. ఇంక నేను నీతో పోట్లాడక పోవడానికి కారణం, నువ్వు ఏ తప్పూ చెయ్యక పోవటమే".

"...." అతను మాట్లాడబోతుంటే వారించింది.

"నిజం మోహన్! నువ్వు ఏ తప్పూ చెయ్యలేదు. నా ప్రవర్తనలో నువ్వు కనిపెట్టిన ప్రతి తప్పునీ నువ్వు విశ్లే షించుకుని పెద్ద మనసుతో నన్ను సహించావు. అయిన ప్పటికీ పాతిక సంవత్సరాలు నేను నీతో జీవించి కూడా... నేను నా కులం మీద ప్రేమను వదులుకోలేదు. ఈ రోజు ఈ సందర్భంలో అది బయటపడింది. అదీ నీ భావన. అందుకే నీ కోపం. అందుకే ఈ మౌనం"

మోహన్రావు ఏమీ మాట్లాడలేదు.

"మోహన్! ఒక్కసారి ఆలోచించు. నువ్వు నిజంగా నన్నెప్పుడూ బాధించలేదా? ఆనాడు అందర్నీ విడిచి పెట్టి నీతో వచ్చేశాను. ఆ తర్వాత తిరిగి నా తల్లినీ, తండ్రిని, చెల్లెళ్ళనీ నేను మళ్ళీ చూశానా? నీ వాళ్ళంతా నీతోనే ఉన్నారు. వాళ్ళకి చెయ్యాల్సిందంతా చేశావు. వాళ్ళతో నీ ఉద్వేగాలన్నీ పంచుకుంటూనే ఉన్నావు. కాని నేను?; మా వాళ్ళంతా దుర్మార్గులనీ, అభిమా నాలు లేనివాళ్ళనీ... నువ్వు ఎన్నోమార్లు అన్నావు. నేను మాట్లాడకపోతే... మా వాళ్ళ నుంచి ఆరంభిం చిన నీ విశ్లేషణ నేను పుట్టిన కులంలోని ప్రతి ఒక్కరూ ఒకే రకమైన దుర్మార్గులని నువ్వు వాదించటానికి ఆధారం అయింది. నువ్వు అభ్యుదయవాదినంటావు. గతంలో ఏర్పడిన ప్రతి మూసనీ వదులుకున్నప్పుడే మనిషి అభ్యుదయవాది అవుతాడంటావు. మనిషి మనిషిగా జీవించటమే కోరదగినది అంటావు. అలా అనే నీవు... తరతరాల బ్రాహ్మణుల వల్లనే సమాజం భ్రష్టమై పోయిందని వాదించు తున్నప్పుడు... నువ్వు ఏ బ్రాహ్మణుల గురించి మాట్లాడావు? బ్రాహ్మణ కులంలో పుట్టిన బ్రాహ్మణుల గురించా...? తోటి మని షిని తనకున్న తక్కువవాడిగా భావించి... వాడికన్న తను అధికుడననుకుని... ఆ ఆధ్యికతను రకరకాల రూపాలలో ప్రదర్శించే మనుషులలోని బ్రాహ్మణుల గురించా...!! కులాన్ని బట్టి బ్రాహ్మణులనేవాళ్ళా? మనస్తత్వాన్ని బట్టి బ్రాహ్మణులయినవాళ్ళా?...

'మోహన్! నువ్వు వాదించేటప్పుడు... నిందించేట ప్పుడు... నీ మనసులో ఉండేదేంటో నాకు తెలియదు గాని... నీ నోట్లో ఉండేది ఒక్కటే... కులాన్ని బట్టి బ్రాహ్మణులయిన వాళ్ళే! తండ్రి చేసిన అప్పులకి కొడు కులు, మనవలు వెట్టిచాకిరీ చేయటం తప్పని వాదించే వాళ్ళు చరిత్రలో జరిగిపోయిన వాటికి ఈనాటి వాళ్ళనే కారకులనటం సమంజసమా! అని ఒక్కమార యినా ఆలోచించావా? ఆ కులంలో పుట్టిన నా ముందు నీ వాదనలు చేసేటప్పుడు నా ఫీలింగ్స్ గూర్చి ఒక్కమారైనా సహానుభూతితో స్పందించావా? అది హృదయరాహిత్యం కాదా!

మోహన్! ఎవరిలోకి వాళ్ళు చూసుకుంటే వాళ్ళకి వాళ్ళే కనబడతారు. ఒకరిలోకి ఒకరు చూసినప్పుడే

ఒకరికొకరు కనబడతారు. నువ్వు మగాడివనీ, అందుకే నువ్వు నా ఫీలింగ్స్‌ని పట్టించుకోలేదని నేనూ అనుకోవచ్చు. కాని నేనలా అనుకోలేదు. ఈ రోజు నేను నువ్వనుకున్నట్టు బ్రాహ్మణ కులాన్ని తిరిగి పులుము కోటానికి ఆశ పడుతున్నాన న్నది సత్యమే అనుకుందాం. నువ్వు నా ప్రలోభానికి జాలిపడి నాతో మాట్లాడి నన్ను సరి చెయ్యటానికి ప్రయత్నం చెయ్యాలి. దానికి బదులుగా... పాతికేళ్ళ తర్వాత.... మన మధ్య ఏదో... ప్రేమ... అవగాహన.... ఉందని... భ్రమ..! హూం ఇదే అసలైన భ్రమ. నువ్వు నాతో మాట్లాడకపోవడం... రియల్లీ షాకింగ్...! నీ రియాక్షన్ – ఇంత చిన్న విషయానికి... రియల్లీ బ్లండర్!....''

మూసుకున్న కళ్ళు తెరిచాడు.

''నాకే నా ప్రవర్తన షాకింగ్‌గా ఉంది వసూ!'' అన్నాడు మోహన్రావు.

ఆమె మీద చెయ్యివేసి... దగ్గరకు లాక్కుంటూ... ఆమె విదిలించుకుని... ఏడుస్తూంటే... బల వంతంగా పొదుపుకుంటూ.... 'వెరీ వెరీ సారీ...' అంటూ....

కొంత సేపటికి.

ఉద్వేగాలు సర్దుకుంటూండగా... మరేదో ఉద్వేగం అలుముకుంటూండగా.... మోహన్రావు లేవ బోయాడు. 'ఊహూ... వెళ్ళకు' 'అంటోన్న వసుధతో ''లేదు... వెళ్ళను'', అంటున్నాడు. మనసంతా సత్య దర్శనం కోసం ఉద్విగ్నమవుతోంది. అస్థిమితం.

ఆమె నిద్రలోకి జారుకున్నాక–

లేచి తను రాసుకునే బల్ల దగ్గరికి వెళ్ళి దీపం వేశాడు.

'దళితధ్వని' రాబోయే సంచికకోసం రాసిన సంపాదకీయం వెంట అతని చూపులు కదిలి, అస్థిమితం పెరిగింది. కిటికీ తెరలు తీసి బయటకు చూశాడు. నగరం దీపాల పడవలా కనిపిస్తోంది. అంతా అసంగతంగా అనిపిస్తోంది.

మళ్ళీ వచ్చి రాయటం మొదలెట్టాడు–

'సత్యాన్ని చూడగలనా? చూడగలిగినా చూపించగలనా? వాక్యాల మేలి ముసుగులు వేసి లోపల కలిగే భావాలను దాచేస్తున్నానా? ఇదంతా నా వాళ్ళ చప్పట్ల కోసమా? పునాదులు లేని విషయాలను చెప్పటానికి నా బుద్ధి, హృదయం ఎంత భాషా పటిమను ప్రదర్శిస్తాయి? పునాదుల లోకి వెళ్ళి నా కంటికి కనిపించినా వాటిని, మనసుకి అనిపించిన వాటిని చెప్పాలని కలిగే తహతహను నావాక్యాలు ఎందుకు ఆపేస్తాయి? నాకు కలిగే ప్రశ్నలు – నా ఆత్మ విమర్శ ... నాలోనే ఎందుకు ఆగిపోతున్నాయి? ఏ జాతికైనా ఆత్మసమర్థన ఎంత అవసరమో ఆత్మ విమర్శ కూడా అంతే అవసరం కదా! నేను ఈ విషయాన్ని ఎందుకు పట్టించుకోలేక పోతున్నాను?...'

రాసింది చదువుతూ రకరకాల ఆలోచనల మధ్య అలాగే ఉండిపోయాడు.

''అన్నానికి రావా మోహన్!'' అంటూ వచ్చింది వసుధ. కుర్చీలో కూర్చుని ఉన్న మోహన్ మెడలో చేతులు వేసింది. అతను ఏదో పొందాలనీ... పొందలేననీ... అస్థిమితంగా కదులుతుంటే గుండెలకి హత్తుకుని రాసినది చదివింది.

''నువ్వు చాలా ఆలోచనా పరుడివి..'' అంది

కొంతసేపు మోహన్రావు మాటలాడలేదు.

''వసూ! నేను ఆలోచనాపరుడినో కాదో నాకు తెలియదు. కాని... ఒక్క విషయం మాత్రం చెప్పగలను. నేను భారతీయుడిని. నేను తెలుగు వాడిని. నేను దళితుడిని. నేను హిందువుని. ఈ రకమైన వర్గీకరణలన్నీ ఒక రకం. నేను మోహన్రావుని. ఇది వ్యక్తిగతం. సమూహ వర్గీకరణలు మనిషి పుట్టకతోనే అతనికి ఆపాదించబడతాయి. అందులో కొన్నిటి పట్ల మనలో ఇష్టమూ కొన్నిటి పట్ల అయిష్టమూ! కొన్నింటిని వదిలించుకోటానికి కొన్నింటిని తగిలించుకోటానికి పెనుగులాట. మనని మన చుట్టూ వాళ్ళూ ఒక వర్గీకరణలోకి నెడితే సంతోషం, ఒక వర్గీకరణలోకి నెట్టలేదని వ్యథ. మోహన్రావుగా నాకు కలిగే ఆలోచనలు ఈ వర్గీకరణలనూ వీటి మీద మన యిష్టా యిష్టాలనూ, ఆనంద విషాదాలనూ అనుసరిస్తూనే ఉంటాయి. ఎప్పుడో ఎక్కడో మోహన్రావు ఆలోచనలు ఇంకా లోతులకు వెళ్ళి సమస్త వర్గీకరణలను వ్యతిరేకిస్తాయి. అలాంటి ఆలోచనలు మోహన్రావు అంతకాలమూ చేసిన ఆలోచనలలో లోపాలు చూపిస్తాయి. ఆలోచనల ద్వారా మనం కోల్పోయిన మానవాంశను గుర్తు చేస్తాయి. అలాంటి ఆలోచనలు అందరికీ వస్తాయి ఏదో క్షణంలో...! కాని వాటిని చూడటానికి... తను చూసిన వాటిని నలుగురికీ చూపించటానికి... మోహన్రావుకి ఎంత ధైర్యం కావాలి! వసుధ, మోహన్రావుల... దగ్గరగా ఉంటూ కూడా ఎంత దూరంగా ఉంటారు!''

వసుధ గురువుని చూసే శిష్యురాలిగా ఉండి పోయింది.

మోహన్రావు ఆమెను చూస్తూ... మెల్లిగా అన్నాడు.

''అయినా... మనం నిరాశపడనవసరం లేదు. ప్రేమ అన్నది వ్యక్తులను వర్గీకరణలకు అతీతంగా దగ్గర చేస్తూనే ఉంది..''

''అవును నిజమే!''

''అలాంటి ప్రేమ వాళ్ళిద్దరి మధ్యా ఉందా?''

''పెళ్ళయితే ఉన్నట్టే''

మోహన్రావు నవ్వాడు.

''ఏం?'' అంది.

జవాబుగా మళ్ళీ నవ్వాడు.

## 5

నెల మీద కొన్ని రోజులు గడిచాక–

శాంత ప్రకాశరావులు, వసుధ మోహన్రావుల ఇంటికి వచ్చారు.

శాంత కళ్ళ నిండా భయం. శరీరంలో నీరసం. వసుధతో తడిపొడిగా మాట్లాడింది. ప్రకాశరావు ముహూర్తం పెట్టిస్తానన్నాడు. ఎంగేజ్‌మెంట్ చేయాలన్నాడు.

వసుధ, మోహన్రావులు వాళ్ళు చెప్పినవన్నీ విన్నారు. అడిగిన వాటికి జవాబు ఇచ్చారు.

తను ఇచ్చిన కాఫీని శాంత ముట్టుకోక పోవడం గమనించింది వసుధ.

వెళ్ళిపోతున్నప్పుడు ప్రకాశరావు మోహన్రావుని పక్కకి తీసుకెళ్ళాడు.

''అమ్మాయి ఛస్తానంది. పట్టుబట్టింది. అందుకే శాంత ఒప్పుకుంది''

తెలుసునన్నట్లుగా మోహన్రావు తలూపాడు.

''మా వైపు వాళ్ళకీ... పట్టింపులు ఉన్నాయి గాని.... శాంత వాళ్ళ పుట్టింటి వాళ్ళు మరింత ఆచార పరులు. దయచేసి.. మీ... విషయం వాళ్ళకి చెప్పకండి. ఇది అరేంజ్డ్ వివాహమని చెప్పుకుంటున్నాం, ఎవరికీ అనుమానం రాదని..''

తల వంచుకుని చెపుతూ ఉన్నాడు ప్రకాశరావు.

గద్గదమవుతున్న ఆ మానవుని స్వరం మోహన్రావుకి ఆ వ్యక్తి మీద జాలి కలిగించింది. తమ ఇద్దరినీ సృష్టించిన సమాజం మీద అసహ్యం కలిగించింది.

***

పెళ్ళికి పదిహేను లక్షల ఖర్చు పెట్టాడు ప్రకాశరావు.

సౌమ్య, సుమన్ కలిసి బ్రతకటమనే కార్యం మొదలయింది.

*

**రచన మాసపత్రిక, అక్టోబర్ 2005**

